క్లుప్తంగా

నేటి నుంచి కారెంపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం

కారెంపూడి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గురువారం నుంచి కారెంపూడిలో ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. గురువారం సాయంత్రం పల్నాటి ప్రజల ఇలవేల్పు వీర్ల అంకాలమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ పీఆర్కే ప్రారంభిస్తారని ఎంపీడీఓ పేర్కొన్నారు. కారెంపూడి -1 గ్రామ సచివాలయం పరిధిలోని బ్రహ్మనాయుడు మేడ ప్రాంతంలో తొలిరోజు 300 గడపల్లో పర్యటించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. ఇదిలా ఉంటే పట్టణ పార్టీ నాయకులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నేపథ్యంలో ఇందుకు అవసరమైన ఏర్పాట్లు ఉత్సాహంగా చేస్తున్నారు.

క్రీడలతో మానసిక ఆనందం



పిడుగురాళ్ల: క్రీడలతో మానసిక ఆనందం ఎంతో కలుగుతుందని మార్కెట్ యార్డు చైర్మన్ కొామెర వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని క్లబ్ టౌన్ షిప్‌లో నిర్వహిస్తున్న వైనాట్ 175 క్రికెట్ టోర్నమెంట్‌కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ రోజు జరిగిన మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్‌లో పోలీస్ వారియర్స్ 20 ఓవర్లతో 165 పరుగులు చేయగా గుంటూరు ఆర్‌సీసీ 120 పరుగులు సాధించి ఆలౌట్ అయ్యారు. ఫైనల్‌కు పోలీస్ వారియస్స్ చేరుకుంది. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌ సన్‌కు మార్కెట్ యార్డు చైర్మన్‌కొామెర వెంకటేశ్వర్లు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ టౌన్ యూత్ అధ్యక్షులు మందా సుధీర్, వైఎస్సార్ సీపీ నాయకులు గొట్టిముక్కల పవన్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు రత్నబాబు, దయాకర్, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు మందుబాబులపై కేసు నమోదు

దుర్గి: మందుబాబులు బహిరంగ ప్రదేశాల్లో మద్యాన్ని సేవించడం చట్టరీత్యా నేరమని ఎస్ఐ కె సతీష్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అడిగొప్పల, దుర్గి గ్రామాలకు చెందిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో తెలంగాణ మద్యాన్ని విక్రయించిన వ్యక్తులు వద్ద ఉన్న చట్టరీత్యా చర్యలు తీసుకుంటానన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం జూదాలకు బెట్టింగ్‌లకు పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించి ఇలాంటి అసాంఘిక చర్యలకు పాల్పడే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏదైనా అనుమానం ఉన్నట్లయితే సంబంధిత వ్యక్తుల కదలికలను తమకు తెలియజేయాలని కోరారు. సమాచారం తెలిసిన వ్యక్తులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని తన సెల్ సెంటర్ : 9440796242ను సంప్రదించాలని కోరారు.

మెడికల్ కిట్టు పంపిణీ



పిడుగురాళ్లరూరల్: జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలకు మెడికల్ కిట్టును బుధవారం ఎంపీడీఓ కాశయ్య ఫీల్డ్ అసిస్టెంట్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కాశయ్య మాట్లాడుతూ.. పనుల సమయంలో కూలీలు ప్రమాదవశాత్తు గాయాలు అయితే వెంటనే ప్రథమ చికిత్స చేసేందుకు మెడికల్ కిట్టు వాడాలని ఆయన అన్నారు. ఎండాకాలం కావున సరైన వసతి కల్పించాలని ఆయన ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ ఎంపీపీ రాజు, టెక్నికల్ అసిస్టెంట్ రమణ, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

పిడుగురాళ్లరూరల్: బాధ్యతగా పని చేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని, పదవి అలంకార ప్రాయం కాదని మాజీ జెడ్పీటీసీ వీరభద్రునిరామిరెడ్డి, మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి అన్నారు. మండలంలోని గుత్తికొండ గ్రామంలో ఇన్‌చార్జి సర్పంచ్ చిన్నపోతుల వెంకట లక్ష్మీ ప్రమాణ స్వీకారం మహోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులాలకు, మతాలకు అతీతంగా ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలకు అందించాలని వారు అన్నారు. అనంతరం పంచాయతీ సెక్రటరీ రవీంద్రారెడ్డి చిన్నపోతుల వెంకటలక్ష్మీచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ నల్లబోలు రామారావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ రత్నాకర్‌రావు, ఎంపీటీసీలు నల్లబోలు వెంకట్రావు, మొగిలి వెంకటేశ్వర్లు, కో ఆప్షన్ నెంబర్ మస్తాన్‌వలి, కావూరి రామాంజనేయులు, మాజీ ఎంపీటీసీ నారికేళ్లపు సాంబశివరావు, మాజీ సర్పంచ్ కుంబా అచ్చయ్య, వాలునాయక్, కుంభా గోవింద్, నల్లబోలు శివకృష్ణ, రామ కోటేశ్వరరావు, బండ్ల లింగయ్య, కొత్త రమేష్, సచివాలయ సిబ్బంది తరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేయాలి
- వచ్చే నెలలోనే వరికపూడిసెల ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన



సేవారత్న వలంటీర్ బ్రహ్మారెడ్డిని సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

వెల్దుర్తి: పల్నాడు ప్రజల చిరకాల వాంఛ అయిన వరికపూడిసెల ఎత్తిపోతల పథకం నిర్మాణానికి వచ్చే నెలలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో శంకుస్థాపన చేయిస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వెల్దుర్తి తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మండపంలో జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న వరికపూడిసెల పథకం నిర్మాణానికి అటవీ, పర్యావరణ అనుమతులతోపాటు రూ. 1650 కోట్ల నిధులను కూడా కేబినెట్ అనుమతులు ఇచ్చిందన్నారు. వర్షాధారంపై ఆధారపడి పంటలు పండించుకుంటూ ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ పథకం వరప్రదాయిని అన్నారు. ఏడు దశాబ్దాల నుంచి ఈ పథకం కోసం అనేక ఉద్యమాలు జరిగాయన్నారు. ఇంతకు ముందు ముఖ్యమంత్రులు నామ్‌కేవాస్తే శంకుస్థాపనలు చేశారన్నారు. 2016 మే 2వ తేదీన మాచర్లలో జరిగిన కరువు ధర్నాలో పాల్గొన్న జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రాజెక్టు అనుమతుల కోసం చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ పథకానికి కేంద్రప్రభుత్వం నుంచి అటవీ, పర్యావరణ అనుమతులు తీసుకురావడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతోపాటు తాను కూడా ఎంతో కృషి చేశామన్నారు. 1996లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ పథకానికి శంకుస్థాపన చేశారన్నారు. ఆ తరువాత ఈ పథకం గురించి పట్టించుకోలేదన్నారు. అసెంబ్లీలో తాను ఈ ప్రాజెక్టు గురించి మాట్లాడితే ఈ పథకానికి కేంద్రం నుంచి అనుమతులు తీసుకురాలేమని జీఓ ఇచ్చామన్నారు. 2018లో మరలా ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని రైతులను మోసం చేశారన్నారు. పల్నాటి ప్రజల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో పాటుపడుతున్నారన్నారు. మండలాన్ని అభివృద్ధి చేయడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

రూ. 924 కోట్లతో అభివృద్ధి పనులు...

మండలంలో రూ. 924 కోట్లతో అభివృద్ధి సంక్షేమ పథకాలను అందించామన్నారు. గతంలో తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి పనులు చేయకుండా ప్రజలను మభ్యపెట్టారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం నాలుగు సంవత్సరాలలోనే అనేక పథకాలు తెచ్చి పేద ప్రజల అభివృద్ధికి పాటుపడిందన్నారు. మండలంలో రూ. 320 కోట్లతో జాతీయ రహదారి పనులు జరుగుతుంటే నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ఈ నిధులు కేంద్ర ప్రభుత్వ నిధులు కదా అని అంటున్నారని, ఈ నిధులను మంజూరు చేయించింది ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, తానేనన్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఈ పనులు ఎందుకు చేయలేకపోయారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ఓర్చుకోలేని వారు ప్రజలను మోసం చేసేందుకు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారన్నారు. వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉండి వారికి రావాల్సిన సంక్షేమ పథకాలను మంజూరు చేయించి ఇంటి వద్దనే వారికి అందించే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న పథకాన్ని తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలో 1.30 లక్షల సచివాలయ ఉద్యోగాలు, 2.30 లక్షల వలంటీర్లను తీసుకురావడం జరిగిందన్నారు. వలంటీర్లు వారికి కేటాయించిన 50 ఇళ్లల్లో ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండి వారికి కావాల్సిన అన్ని పనులను దగ్గరుండి చేయించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. వలంటీర్లు విధులలో నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదన్నారు. ప్రజాప్రతినిధులకు, పార్టీ నాయకులతో సమన్వయంగా పనిచేయాలన్నారు. ఇన్ని పనులు చేస్తున్నా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ మద్దతుగా నిలవాలన్నారు. అంతకు ముందు వలంటీర్లకు వందనం కార్యక్రమంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం సేవారత్నకు ఎంపికైన బ్రహ్మారెడ్డిని ఎమ్మెల్యే పీఆర్కే శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి, మాచర్ల మార్కెట్‌యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, మండల పరిషత్ అధ్యక్షుడు చింతా శివరామయ్య, జడ్పీటీసీ రూప్లీబాలునాయక్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు అలుగుమల్లి సంజీవరెడ్డి, రాయంకుల గోపాల్, వైఎస్సార్‌సిపి నాయకులు కేసిరెడ్డి పిచ్చిరెడ్డి, వెంకటరెడ్డి, పులుసు నారాయణరెడ్డి, జూలకంటి నాగిరెడ్డి, కోట్ల పాపిరెడ్డి, సొసైటీ అధ్యక్షులు తాడికొండ పుల్లారెడ్డి, గుంటక పెద చెన్నారెడ్డి, చల్లా శ్రీను, ఎంపిడివో ప్రసాద్, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నర్సరీలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



నర్సరినీ ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి

దుర్గి: రైతులకు మేలైన మొక్కలను అందించి రైతాంగ అభివృద్ధికి నర్సరీ నిర్వాహకులు తోడ్పడాలని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆత్మకూరు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన నర్సరీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ నర్సరీ పరిశ్రమకు అనేక రాయితీలను కల్పించి నర్సరీ రంగాన్ని అభివృద్ధి పరచాలన్నారు. సన్న, చిన్న కారు రైతులు అందరికీ సబ్సిడీని అందజేసి పరిశ్రమ అభివృద్ధికి మనందరి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. మేలైన విత్తనాలను ఎంపిక చేసుకుని రైతుల అభివృద్ధికి తోడ్పడాలని నిర్వాహకులు కోరారు. సీఎం జగన్ రైతాంగం కోసం ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని వాటిని ఉపయోగించుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని స్థానిక రైతులను ఉద్దేశించి అన్నారు. రైతులకు నాణ్యమైన 9గం''లకు ఉచిత కరెంటును అందజేస్తున్న ఘనత మన సీఎంకే దక్కుతుందని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండిగోపాల్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

పిడుగురాళ్ల: పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కౌన్సిలర్ అజ్మీర శారద అన్నారు. పట్టణంలోని 6వ వార్డులో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి ప్రవేశపెట్టిన మేరీ లైఫ్, మేరా స్వేచ్ఛ భారత్‌లో భాగంగా ఆర్ఆర్ఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మనకు పనికి రాని వస్తువులను వెంటనే రీ సైక్లింగ్‌కు పంపించాలని, అలాగే మనము వ్యర్థాలను వినియోగించకూడదని, మనకు పనికి వచ్చే వస్తువులను మాత్రమే వాడాలని సూచించారు. పట్టణంలోని సచివాలయంలో త్రిబుల్ ఆర్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, దీనిలో పనికిరాని వస్తువులను అందజేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది మెహర్, వార్డు ప్రజలు తదితరులు ఉన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

మాచవరం: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా గుర్తించాలని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎం.సాంబయ్య అన్నారు. మండలంలోని మోర్జంపాడు గ్రామ సచివాలయంలో పాపాయపాలెం ఫారెస్ట్ సెక్షన్ పరిధిలోని బోధనం బీట్ పరిధిలోని గ్రామాల ప్రజలకు పర్యావరణ హిత జీవనశైలి కార్యక్రమంలో భాగంగా అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలచే ప్లాస్టిక్ వాడకం తగ్గిస్తామని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని, నీటిని పొదుపుగా వాడతామని, విరివిగా చెట్లు పెంచాతామని , విద్యుత్‌ను ఆదా చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లచ్చిరెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ బ్రహ్మారెడ్డి, వెంకటాయపాలెం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎం. వెంకట్రావు, పాపాయపాలెం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాకేష్, పలువురు ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి

దుర్గి: రాష్ట్ర రైతాంగం కోసం, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు బాంధవుడుగానిలిచారని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని ధర్మవరం, ఓబులేశునిపల్లె, రైతు భరోసా కేంద్రాలను సందర్శించి స్థానిక రైతులను ఉద్దేశించి మాట్లాడారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమనటువంటి విత్తనాలు ఎరువులు సబ్సిడీలో తైవాన్స్ స్ప్రేయర్లు, టార్పాలిన్ పట్టలు అందుబాటులో ఉంటాయని రైతులకు తెలిపారు. ధర్మవరం, రైతు భరోసా కేంద్రం పరిధిలో 974 మంది రైతులు రైతు భరోసా లబ్ధిదారులు ఉన్నారని వివరించారు. పల్నాడు జిల్లా పరిధిలో 424 రైతు భరోసా లబ్ధిదారులు ఉన్నారని వివరించారు. పల్నాడు జిల్లా పరిధిలో 424 రైతు భరోసా కేంద్రాలు మాచర్ల నియోజక వర్గ పరిధిలో 73 కేంద్రాలు రైతులకు విస్తృతమైన సేవలో అందిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు జిల్లా అధికారులతో మాట్లాడి పరిష్కరించటానికి కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గ పరిధిలో దాదాపుగా 45000 మందికి పైగా రైతు భరోసా పథకానికి అర్హులుగా ఉన్నారని, వారందరికి లబ్ధి పొందే విధంగా ఆయా రైతుభరోసా కేంద్రంలో పనిచేస్తున్న వ్యవసాయ సిబ్బంది రైతులకు తోడ్పాటునందించాలని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గంగారపు లక్ష్మి, వెంకటరెడ్డి, ఉన్నం పెద్దబ్బాయి, వ్యవసాయాధికారి వై అమీర్‌రెడ్డి, వీఏఏ తులసినాయక్, రైతులు పాల్గొన్నారు.

రైతాంగ వార్షిక సంచిక కరదీపిక ఆవిష్కరణ

పిడుగురాళ్ల: రైతు కూలీ సంఘం ప్రచురించిన 2022 వార్షిక సంచిక రైతాంగ పీడిత ప్రజా ఉద్యమాలకు కరదీపిక లాంటిదని ఓపీడీఆర్ రాష్ట్ర నాయకులు శానంపూడి వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని తరిమెళ్ల నాగిరెడ్డి నగర్‌లో సమావేశం నిర్వహించి వార్షిక సంచికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమవానికి జిల్లా కార్యదర్శి, రాష్ట్ర నాయకులు ఉల్లిగడ్డల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, తాము చేపట్టే సమస్యల పరిష్కారం కోసం ఈ పుస్తకంలో ప్రచురించిన అనుభావలను, మేధావుల చేసిన ఉపన్యాసాలను, తమ ఉద్యమాల్లో జీవతాల్లో అన్వయింపచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎంఎస్ నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు నీలాద్రి రాంబాబు, సహాయ కార్యదర్శి దానబోయిన భాస్కర్‌రావు, జిల్లా కమిటీ సభ్యురాలు జక్కంపూడి పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాణి, రైతు కూలీ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఓపీడీఆర్ రాష్ట్ర నాయకులు శానంపూడి వెంకటేశ్వర్లు

26న అడిగొప్పలలో వలంటీర్లకు సన్మానం

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వలంటీర్ల సన్మాన మహోత్సవ కార్యక్రమం శుక్రవారం అడిగొప్పల గ్రామంలో నిర్వహిస్తున్నట్లు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు హాజరుకానున్నట్లు వివరించారు. అడిగొప్పల సచివాలయం ఆవరణలో ఉదయం 10గం''లకు కార్యక్రమం ప్రారంభమౌతుందన్నారు. అడిగొప్పల 1,2, ఓబులేశునిపల్లె, ధర్మవరం, సచివాలయం పరిధిలోని రాజానగరం, శ్యామరాజపురం, గ్రామాలకు చెందిన వలంటీర్లకు సన్మాన మహోత్సవం జరుగనున్నది. కావున మండల పరిదిలోని ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొని కార్యక్రమం జయప్రదంగా కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దాచేపల్లి : ద్విచక్రవాహనం అదుపు తప్పి వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామ పరిధిలో జరిగిన ఈ ఘటనలో ప్రకాశం జిల్లా మైనంపాడుకు చెందిన రాయపాటి ప్రకాష్‌రెడ్డి(30) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సీఐ షేక్ బిలాలుద్దీన్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మైనంపాడుకు చెందిన రాయపాటి ప్రకాష్, ఇతని సమీప బంధువు రెబ్బవరపు రమేష్ ద్విచక్రవాహనంపై వ్యక్తిగత పనుల నిమిత్తం నల్గొండ వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని తిరిగి ద్విచక్రవాహనంపై ఇద్దరు స్వగ్రామానికి బయలు దేరారు. గామాలపాడు సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి ద్విచక్రవాహనం డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రకాష్‌కు తీవ్ర గాయాలుకావడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ద్విచక్రవాహనంపై ఉన్న మరో వ్యక్తి రమేష్ గాయాలతో బయటపడ్డాడు. ఘటనా స్థలానికి పోలీసులకి చేరుకుని మృతదేహాని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. గాయపడిన రమేష్‌ను కూడా 108లో వైద్య సేవల కోసం తరలించారు. మృతుడు ప్రకాష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన ఎంపీడీఓ

గురజాల : మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ ఆర్ ఫణికుమార్ నాయక్ బుధవారం పరిశీలించారు. మండల పరిధిలోని గంగవరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశంలో టెంట్‌లు ఏర్పాటుతో పాటు మంచినీటి వసతి, పని ముట్లు వంటివి అందుబాటులో ఉంటున్నాయా లేదా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. పని జరుగుతున్న ప్రాంతంలో ప్రథమ చికిత్స కిట్లును అందుబాటులో వుంటున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనుల ద్వారా రైతులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు చేసుకోవచ్చన్నారు. వేసవి కాలంలో ఉపాధి హామీ పథకం ద్వారా పేద కూలీలకు ఉపాధి దొరుకుతుందన్నారు. ఎంపీడీఓతో పాటు ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, సర్పంచ్ బుక్కిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులున్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

మాజీ సీఎం చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం

వెల్దుర్తి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 32 లక్షల మంది పేదప్రజలకు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి నివాస స్థలాలు కేటాయిస్తే ఓర్చుకోలేని మాజీ సిఎం చంద్రబాబునాయుడు సెంటు స్థలంలో సమాధులు కట్టుకోవడానికి కూడా పనికిరాదని పేద ప్రజలను అవమానిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన వెల్దుర్తి బస్టాండ్ సెంటర్‌లో మాజీ సీఎం చంద్రబాబునాయుడు దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేసి మాట్లాడారు. 14 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు గజం స్థలం కూడా పేద ప్రజలకు ఇవ్వని చంద్రబాబునాయుడు మంచి పనులు చేస్తున్న మనసున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. జగన్ ప్రభుత్వం ఇంటి స్థలం మంజూరు చేయడంతోపాటు రూ 1.80 లక్షల నిధులిచ్చి గృహ నిర్మాణం కోసం పాటుపడుతుందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలో జరగడం లేదన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాల ద్వారా లక్షల రూపాయలు చేరుతున్నాయన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని అందరూ కలిసికట్టుగా పనిచేసి మళ్లీ అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి, మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, మండల పరిషత్ అధ్యక్షుడు చింతా శివరామయ్య, జెడ్పీటిసి రూప్లీబాలు నాయక్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు అలుగుమల్లి సంజీవరెడ్డి, రాయంకుల గోపాల్, వైఎస్సార్ సీపీ నాయకులు కేసిరెడ్డి పిచ్చిరెడ్డి, వెంకటరెడ్డి, పులుసు నారాయణరెడ్డి, జూలకంటి నాగిరెడ్డి, కోట్ల పాపిరెడ్డి, సొసైటీ అధ్యక్షులు తాడికొండ పుల్లారెడ్డి, గుంటక పెద చెన్నారెడ్డి, చల్లా శ్రీను, బలిగొడుగుల శ్రీనివాసరావు, మేకల కోటిరెడ్డి, చిన్నపరెడ్డి చినమల్లారెడ్డి, పార్లపల్లి పెద గాలయ్య, చింతా ఆదినారాయణ,తోట ఆంజనేయులు, కోళ్ల ఫారం వెంకటనారాయణ, కాయకోకుల రామాంజనేయులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

ఎంపీపీ కటకం జయశ్రీ

దాచేపల్లి : అభివృద్ధిలో దాచేపల్లిని ఆదర్శంగా నిలుపుతామని, కనీస మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఎంపీపీ కటకం జయశ్రీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జయశ్రీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. గ్రామాల వారీగా చేపడుతున్న అభివృద్ధి పనులు గురించి, గ్రామాల్లో నెలకొన్న సమస్యల గురించి సమావేశంలో చర్చించారు. వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటికి ఇబ్బందులు లేకుండా యుద్ధప్రతిపాదికన చర్యలు తీసుకోవాలని అధికారులను ఎంపీపీ జయశ్రీ ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహకారంతో మండలంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, గత ప్రభుత్వాల కన్నా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మునుపెన్నడు జరగని అభివృద్ధి, సంక్షేమం మండలంలో జరుగుతుందని ఎంపీపీ జయశ్రీ చెప్పారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకున్నామని, ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించి అక్కా చెల్లెమ్మలకు అండగా ఉంటామని ఆమె తెలిపారు. జెడ్పీటీసీ మూలగొండ్ల కృష్ణకుమారి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రభుత్వ అధికారులు సమర్ధవంతంగా అమలు చేయాలని, అర్హులైన ప్రతి పేదవాడికి పథకాలు అందించే బాధ్యతను అధికారులు తీసుకోవాలన్నారు. పథకాల అమలులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, పార్టీలు, మతాలకు అతీతంగా అర్హతను ఆధారం చేసుకుని పథకాలు అందించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులపై కూడా ప్రత్యేక దృష్టిని సారించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు చెప్పారు. ఈ సమావేశంలో డిఎల్‌పిఓ గబ్రూనాయక్, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, సొసైటి అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, ఎంపీడీవో సాంబశివరావు, ఈఓపీఆర్డీ నాగెండ్ల రత్నం, పీహెచ్‌సీ డాక్టర్ ఆమూల్య, ప్రభుత్వ అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు

ఏఓ బ్రహ్మారెడ్డి

రెంటచింతల: ఖరీఫ్‌సీజన్‌లో రైతులు విత్తన శుద్ది చేయడం వల్ల చీడపీడల నుంచి పంటలను రక్షించుకోవడం వలన అధిక దిగుబడులను సాధించి ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చనని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి తెలిపారు. బుధవారం మండలం లోని మల్లవరం రైతుభరోసా కేంద్రంలో రైతులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పది లీటర్ల నీటిలో 1.5 కిలోల ఉప్పును కలిపి ఎంపిక చేసుకున్న వరి విత్తనాలను పోయగా పైకి తేలిన తాలు విత్తనాలను తీసివేసి నీటి అడుగున మునిగి ఉన్న గట్టి విత్తనాలను నారు పోసుకోవడానికి వాడుకోవాలన్నారు. కిలో వరి విత్తనానికి ఒక లీటరు నీటిలో 2.5 గ్రాముల కార్బండజిమ్ కలిపి 24గం.ల నానబెట్టిన అనంతరం మరో 20 నుంచి 24గం.ల పాటు మంచినీటిలో విత్తనాన్ని ఉంచి తరువాత నారు మడులలో చల్లుకోవాలన్నారు. విత్తనాల ద్వారా సంక్రమించే తెగుళ్ళ నివారణ కోసం కిలో విత్తనానికి 3గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. నారుమడిలో ఆకు తినే పురుగులు, ఉల్లికోడు, మొవ్వ పురుగు సోకకుండా ఉండటానికి మొలకెత్తిన విత్తనాన్ని నారు మడిలో చల్లేముందు 0.2 శాతం క్లోరిప్రేరిఫాస్ ద్రావణంలో నానపెట్టి చల్లు కోవాలన్నారు. ఒక కిలో పత్తి విత్తనాన్ని 8 గ్రాముల ట్రైకో డెర్మావిరిడితో, ఒక కేజీ మిరప విత్తనాన్ని 8 నుంచి 10 ఎంఎల్ గౌచో ద్రావణంలో విత్తన శుద్ధిచేయడం మంచిదన్నారు. పత్తి చుట్టూ అంతరపంటగా 4సాళ్లకు ఒక సాలుకు కంది, మినప, పెసర పంటలను సాగుచేసు కోవడం వలన రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

సువార్త స్వస్థత ఉజ్జీవం సభ

మాచర్ల: పల్నాటి ప్రాంతంలో ప్రతి ఒక్కరికీ మేలు జరగాలని కోరుతూ సువార్త స్వస్థత ఉజ్జీవం సభ నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ ఈవి రమణబాబు అన్నారు. బుధవారం మూడవ రోజు రాయవరం జంక్షన్‌లో పాస్టర్ ప్రవీణ్, సిస్టర్ షారోన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని సందేశాన్ని అందించారు. ప్రతి క్రైస్తవుడు తోటి వారిని ప్రేమిస్తూ అన్ని మతాలను గౌరవిస్తూ ఏసుప్రభువు ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పల్నాటి ప్రాంతానికి చెందినపాస్టర్లు భారీస్థాయిలో తరలివచ్చి పాస్టర్ ప్రవీణ్, షారోన్‌ల ఆధ్వర్యంలో ఏసుక్రీసుతను స్తుతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వేలాది మంది క్రైస్తవులకు వేదిక మీద ఉన్న పలువురు పాస్టర్లు బైబిలు యొక్క ప్రాధాన్యత వివరించారు.

విటమిన్ -డి ద్రావణం పంపిణీ

పిడుగురాళ్ల: పట్టణంలోని గుంటూరు బస్టాండ్ వద్ద పెద్ద సుబ్బారావు చలివేంద్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ ఎన్. ధనలక్ష్మీ ప్రారంభించి విటమిన్ -డి ద్రావణాన్ని ప్రజలకు అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండల తీవ్రత చాలా అధికగా ఉందని, ప్రజలు ఎక్కువ సమయం బయట తిరగకూడదని ఆమె వివరించారు. వడదెబ్బకు గురి కాకుండా చూసుకోవాలన్నారు. ఎక్కువగా నీరు తాగాలని సూచించారు. చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విటమిన్ -డి ద్రావణం పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలియజేశారు.

హుండీ కానుకల ఆదాయం రూ. 15లక్షలు



దుర్గి: అడిగొప్పల శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి హుండీ కానుకలు లెక్కించగా రూ. 15,98,665ల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. బుధవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పేటసన్నిగండ్ల గ్రూప్ టెంపుల్స్ కార్యానిర్వాహణాధికారి సైదమ్మబాయి ఆధ్వర్యంలో 34 రోజుల పాటు భక్తులు అమ్మవారికి సమర్పించిన హుండీ లెక్కింపు చేపట్టారు. కానుకల రూపంలో వచ్చిన ఆదాయాన్ని బ్యాంకు అధికారులకు అందజేసి సంబంధిత రసీదును తీసుకున్నట్లు అధికారులకు వివరించారు. కార్యక్రమంలో కరాలపాటి సుబ్బారావు, పాండురంగారావు, కలవల వెంకటేశ్వర్లు, కొత్త నరసింహారావు, నాగారపు ఆంజనేయులు, ఎన్ఎంఆర్ సిబ్బంది, అర్చక, పరిచారక, నాయీ బ్రాహ్మణులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.